మినీకథ:

# కుక్క-మాంసంముక్క

అది—ముచ్చటగా రెండే రెండు వాటాలున్న డాబా యిల్లు. దాన్ని సూరిబాబు డాబా అంటారు. అలాగని సూరిబాబు దాని సొంతదారు కాడు. తనూ అద్దెకే ఉంటున్నాడు. ఎన్నాళ్ళగానో ఒక వాటాలో పాతుకుపోయి—మరో ఊళ్ళోఉన్న యజమాని దగ్గర సర్వహక్కులూ పొంది—రెండో వాటామీద అజమాయిషీ చలాయిస్తున్నాడు.

డాబా ముందు విశాలమైన ఆవరణ వుంది. దాన్లో రంగురంగుల పూలమొక్కలున్నాయి. చుట్టూ ప్రహరీ ఉంది. ప్రహరీని కలుపుతూ ఎత్తైన గేటుంది. గేటు కుడి రెక్కమీద 'గేటు మూయవలెను' అనే నిజం బోర్డు. ఎడమ రెక్కమీద 'కుక్క ఉన్నది జాగ్రత్త' అనే దొంగ బోర్డు ఉన్నాయి. డాబా అంత 'రూలు'గా ఉండడానికి కారకుడు సూరిబాబే. అద్దె కొంపని సొంతయింటిలా భావిస్తాడు. అలాగే భావించమని రెండోవాటా వాళ్ళని శాసిస్తాడు. అద్దెకిచ్చే ముందు నిబంధనలు వినిపించి ఆంక్షలు విధిస్తాడు. కోళ్ళున్నా, కుక్కలున్నా, పశువులున్నా, ముగ్గురు మించి పిల్లలున్నా, ఉన్న పిల్లల్లో అల్లరి వాళ్ళున్నా వాటా అద్దెకు దొరికే ప్రసక్తి లేదు అతని ఆంక్షలకి తట్టుకోలేక ఎన్నో కాపురాలు మధ్యలో జండా ఎత్తేశాయి.

వెంకటపతి అనే పెద్ద మనిషొకాయన నిబంధన లన్నిటికీ తల ఊపి — తీరా వాటాలో చేరిన రెండోరోజున ఒక చూలు గేదెను కొనుక్కొని ఆవరణలో కట్టేశాడు. ఆ రాత్రి గేదె ఈనింది. బుల్లి దూడకి జన్మనిచ్చింది.

యిది చూసి సూరిబాబు ఉగ్రుడైపోయాడు. కాలు చెయ్యి ఆడక జుట్టు పీక్కున్నాడు. యిన్నాళ్ళా నీట్‌నెస్‌కోసం పడ్డ శ్రమ అంతా గేదె మూలంగా వృథా అయినట్టు ఫీలయ్యాడు. అతని కళ్ళముందు ధ్వంసం కాబోతున్న పూలమొక్కలు, చెడువాసనతో రొచ్చుతో బురదమయం కాబోతున్న ఆవరణ, తద్వారా విజృంభించే దోమలు కదిలాయి.

కోపం కూడగట్టుకుని 'వెంకటపతి గారూ' అంటూ వాళ్ళ ముందుగదిలోకి చొరబడ్డాడు సూరిబాబు.

"వచ్చారూ.రండి.కూర్చోండి యింకా మీకు పంపిద్దా మనుకుంటున్నా. పోన్లెండి. యిద్దరం కలిసి ఆరగిద్దాం. గేదె రాత్రి ఈనింది. అరె. కూర్చోరేం. అమ్మాయ్. పట్రా" అన్నాడు వెంకటపతి. 'ఏవిటీ సంధిప్రేలాపన' అని సూరిబాబు అనుకుంటుంటే వెంకటపతి కూతురు రెండు ప్లేట్లతో జున్ను తెచ్చి ముందు పెట్టింది. సూరిబాబు కళ్ళు మెరిశాయి. నోరూరింది. రుచికరమైన జున్నును సేవించి నవ్వుతూ సెలవు తీసుకున్నాడు వెంకటపతి దగ్గర.

—గుత్తుల భాస్కరరావు